**జరిగిన కథ :** మధిర సుబ్బన్న దీక్షితులు రచించిన కాశీమజిలీ కథలు 8వ సంపుటిలోని 'సప్తమిత్ర చరిత్ర' ఇది. కాశీ నగరంలో ఉండే దత్తకుడు అనే బ్రాహ్మణ బాలుడు.. ఉపాధికోసం ధారానగరం వెళ్తున్నాడు. దారి మధ్యలో అనుకోకుండా ఒక యక్షదంపతులు ఏకాంతంగా ఉన్న సమయంలో చూశాడు. ఆ యక్షుడు శాపం పెట్టడంతో స్త్రీగా మారిపోతాడు.

కాశీ మజిలీ కథలు 111



# దాచలేని రహస్యం

అనుసృజన: **నేతి సూర్యనారాయణ శర్మ**

యక్షుని శాపంతో స్త్రీగా మారిన దత్తకుడు.. చారుమతిగా రాకుమారి రుక్మిణి అంతఃపురంలో కాలక్షేపం చేయసాగాడు. రుక్మిణికి ఉపాధ్యాయునిగా ఆమె సందేహాలకు తన ప్రతిభతో సమాధానాలు చెబుతుండేవాడు. ఒకనాడు వారిద్దరి మధ్య చర్చలో ఉద్దాలక మహర్షి కుమారుడైన శ్వేతకేతువు రచించిన ధర్మశాస్త్రం ప్రస్తావనకు వచ్చింది.

''ఒకప్పుడు పరస్త్రీ గమనం నిషేధం కాదు. శ్వేతకేతువు ఈ ధర్మశాస్త్రాన్ని వెయ్యి అధ్యాయాలతో రచించిన తరువాత మాత్రమే ఆ నిషేధం వెలుగులోకి వచ్చింది. ఆ శాస్త్రాన్ని నూరు అధ్యాయాలుగా పాంచాలుడు తిరగ రాశాడు. ఈ పుస్తకం అదే'' అన్నాడు దత్తకుడు.

''ఛీ! శాస్త్రమని పేరు పెట్టుకుని, ఇటువంటి నీతిబాహ్యమైన విషయాలు రాయడం ధర్మమా?!'' అన్నది రుక్మిణి ఏవగించుకుంటూ.

''శాస్త్రం విషయంలో అంటరాని వస్తువంటూ ఏదీ లేదు. దేనినీ దాచకుండా చెప్పేదే శాస్త్రం. ఇప్పుడిందులో ప్రధానంగా చర్చించిన విషయమే తీసుకో! ఎవరైనా సరే.. పరస్త్రీ గమనం చేసేవాళ్ల లక్షణం తెలుసుకుంటే కానీ, స్వస్త్రీ రక్షణ విషయం తెలుసుకోలేరు. ఇది పురుషుడికైనా, స్త్రీకైనా వర్తిస్తుంది. ఇటువంటి శాస్త్రాన్ని వివరించి చెప్పేటప్పుడు ఉన్నది ఉన్నట్లుగా చెప్పాల్సిందే కదా! సరే ఇంతకూ ఈ పుస్తకం ప్రకారం.. పురుషుడు తన వయసును సమానభాగాలుగా విభజించుకుని, ధర్మార్థ కామాలను ఒకదానికొకటి బాధకాలు కాకుండా అనుభవించాలి. యవ్వనంలో కామాన్ని అనుభవించాలి. ముసలితనంలో ధర్మాన్ని గురించి తప్పక ప్రయత్నించాలి'' అని ఇంకా ఏదో చెబుతున్నాడు దత్తకుడు.

''అయితే చారుమతీ! యవ్వనమందు కామమే కానీ, అర్థధర్మాలను వాంఛించకూడదా?'' అడిగింది రుక్మిణి.

చారుమతి వేషంలో ఉన్న దత్తకుడు నవ్వి..

''జీవితం అస్థిరమైనది. కనుక ఎప్పుడు ఏది సిద్ధమవుతుందో దానిని తప్పకుండా సంపాదించాలి. ఒకరకంగా చెప్పాలంటే ధర్మార్థాలను సేవించడం సుఖం కోసమే. అట్టి సుఖాన్నే కొందరు కామమంటారు. అధర్మ కామం చెడ్డది. దానివల్ల రావణుడు, పాండురాజు మొదలైనవారు చెడిపోయారు. అజీర్ణం కలుగుతుందని ఆహారం అసలే మానేయకూడదు. పశువులు మేస్తాయని చేను జల్లకుండా విడిచిపెట్టేయ కూడదు. ఆ విధంగా ధర్మార్థకామాలు ఒకదానినొకటి బాధించకుండా చూసుకోవాలి. అలా చేయడమే సుఖస్వరూపమైన స్వర్గప్రాప్తికి హేతువు అవుతుంది. అయితే ఇది ధర్మమూలంగానే వస్తుందని గుర్తుంచుకోవాలి'' అంటూ దత్తకుడు అనేక విషయాలు బోధిస్తున్నాడు.

* * *

ఇలా ఉండగా.. రాకుమారి అన్న అయిన చిత్రసేనుడు తరచుగా వచ్చి దత్తకుణ్ని చూసి పోతున్నాడు. చారుమతి వేషంలోని దత్తకుణ్ని మోహించి.. ఆమెను లొంగదీసుకునేందుకు అనేక ప్రయత్నాలు చేశాడు. కానీ, చారుమతి ఏమాత్రం స్పందించకపోవడం వల్ల చింతాక్రాంతుడయ్యాడు.

అతని చింతను తీర్చే ఉపాయం దత్తకుడి స్నేహితుడైన గోణికాపుత్రుని రూపంలో లభించింది.

దత్తకుడు – గోణికాపుత్రుడు కూడా కాశీలో ఒక గురువు వద్దనే చదువుకున్నారు. అతను కూడా ధారానగరానికే వెళ్తున్నాడు. దారిమధ్యలో అతనికో బ్రహ్మచారి కనిపించాడు.

''అయ్యా! నాదొక పల్లెటూరు. నాపేరు గోమరుడంటారు. బ్రాహ్మణుడిని. చదువు అబ్బలేదు. ముష్టెత్తుకుని జీవిస్తున్నాను. పెళ్లి చేసుకోవడం కోసం నాలుగు డబ్బులు కూడబెట్టుకున్నాను. మీ ఎరుకలో ఎవరైనా ఆడపిల్లలుంటే నాకు పెళ్లి జరిపించగలరా?'' అని జాలి గొలిపేలా అడిగాడు.

గోణికాపుత్రుడు నవ్వేసి..

''నేనిప్పుడు ధారానగరం వెళ్తున్నాను. దారిమధ్యలో ఏదైనా సంబంధం తారసపడకపోదు. నాతో రా'' అన్నాడు.

ఇద్దరూ కలిసి ప్రయాణం సాగిస్తూ విపుల అనే పేరుగల అగ్రహారం చేరుకున్నారు. ఆ అగ్రహారంలో సోమవర్మ అనే దైవజ్ఞుడు ఉన్నాడు. అతను జాతకం చెబితే తిరుగుండదంటారు. తన శాస్త్రపాండిత్యం పేరుప్రతిష్ఠలతో పాటుగా.. సోమవర్మకు చాదస్తాన్ని కూడా తెచ్చిపెట్టింది.

సాధారణంగా జ్యోతిషుడు కొత్తవాడైతే ఏ విషయాన్నీ దాచకుండా చెబుతాడని, శాస్త్రపరిజ్ఞానం పెరిగే కొద్దీ అన్నిటికీ తొందరపడకుండా విజ్ఞత ప్రదర్శిస్తాడని